● ఏనుగమ్మా ఏనుగు.. గులాబీ రంగు ఏనుగు

మీరెప్పుడైనా గులాబీ రంగు ఏనుగు గురించి విన్నారా? దక్షిణాఫ్రికాలోని క్రుగెర్ జాతీయ పార్కులో సఫారీ ఆపరేటర్ ఒకరు ఏడాది వయసున్న అరుదైన ఈ గులాబీరంగు ఏనుగు కూనను తన కెమెరాలో బంధించారు. అల్బినిజం అనే అరుదైన జన్యు స్థితి కారణంగా ఇలా పింక్ రంగులోకి ఏనుగు చర్మం మారిందని జీవశాస్త్రవేత్తలు వెల్లడించారు.

ఇంటి ఖర్చు రెట్టింపు

- దశాబ్దంలో 2.5 రెట్లు పెరిగిన నెలవారీ కుటుంబ వ్యయం
- ఆహారం కంటే దుస్తులు, వినోదంపైనే ఎక్కువ ఖర్చు
- ఎన్ఎస్ఎస్ఓ సర్వేలో వెల్లడి



నెలవారీ తలసరి ఖర్చు అధికంగా ఉన్న రాష్ట్రం- సిక్కిం	పట్టణాల్లో - రూ.12,105 గ్రామాల్లో - రూ.7,731
నెలవారీ తలసరి ఖర్చు తక్కువగా ఉన్న రాష్ట్రం- ఛత్తీస్‌గఢ్	పట్టణాల్లో - రూ.4,483 గ్రామాల్లో - రూ.2,466

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు.. మండిపోతున్న ఇంధన రేట్లు.. దేశ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో నెలవారీ కుటుంబ ఖర్చు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగిపోయింది. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) తాజా నివేదికలో ఈ విషయం వెల్లడైంది. కుటుంబ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) పేరిట నిర్వహించిన ఈ సర్వేలో పట్టణాలు, గ్రామాల వారీగా వివిధ సామాజిక-ఆర్థిక వర్గాల కుటుంబాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయాన్ని(ఎంపీసీఈ) అంచనావేశారు. 2022, ఆగస్టు నుంచి, 2023, జూలై మధ్యలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్ఎస్ఎస్ఓ ఈ సర్వే చేపట్టిందని శనివారం ఓ అధికారిక ప్రకటన పేర్కొన్నది. అన్ని రాష్ట్రాలు, యూటీల్లో మొత్తంగా 2,61,746 కుటుంబాల నుంచి సేకరించిన సమాచారం అధారంగా ఎన్ఎస్ఎస్ఓ ఈ అంచనాలను రూపొందించింది. దేశ ప్రజలు ఆహారం కంటే దుస్తులు, వినోదంపైనే అధికంగా వెచ్చిస్తున్నట్టు ఈ సర్వేలో వెల్లడైంది.

కుటుంబ ఖర్చులు తడిసి మోపెడు

పట్టణాల్లో నెలవారీ తలసరి వ్యయం (ప్రస్తుత ధరల్లో)

సంవత్సరం	ఖర్చు (రూపాయల్లో)
2011-12	2,630
2022-23	6,459

గ్రామాల్లో నెలవారీ తలసరి వ్యయం (ప్రస్తుత ధరల్లో)

సంవత్సరం	ఖర్చు (రూపాయల్లో)
2011-12	1,430
2022-23	3,773

ధనికులు, పేదల మధ్య తీవ్ర అంతరం

రోజువారీ ఖర్చు

	పేదలు	ధనికులు
పట్టణాల్లో	రూ.67	రూ.700
గ్రామాల్లో	రూ.46	రూ.350

ఆహారంపై తగ్గిన ఖర్చు

గ్రామాల్లో - 46% (2011-12లో 53%)

పట్టణాల్లో - 39% (2011-12లో 43%)



ఆడియోమోజీలు వచ్చేస్తున్నయ్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: కుటుంబ సభ్యులతో కానీ, ఫ్రెండ్స్‌తో కానీ చాట్ చేస్తున్నప్పుడు ఎమోజీలను పంపడం ప్రస్తుతం సర్వసాధారణమైంది. ఇప్పుడు వీటిని ఫోన్ కాల్స్‌కు కూడా వర్తింపజేయాలని 'గూగుల్' సరికొత్త ఆలోచన చేస్తున్నది. ప్రత్యేకమైన సౌండ్ ఎఫెక్ట్, యానిమేషన్స్‌తో కూడిన 'ఆడియో మోజీ'లను యూజర్లకు పరిచయం చేయబోతున్నది. ఈ సరికొత్త ఫీచర్‌ను గూగుల్ యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకొస్తున్నది. 'ఆడియో మోజీ'గా పిలుస్తున్న ఈ ఫీచర్‌లో.. స్మైల్, అప్లాజ్, సెలబ్రేట్,లాఫ్, డ్రమ్‌రోల్, పూప్.. అనే 6 రకాల ఆడియో ఎమోజీల్లో ఒకదాన్ని ఎంపిక చేసుకోవచ్చు. మనకు ఫోన్ చేసిన వ్యక్తి స్మార్ట్‌ఫోన్ తెరపై ప్రత్యేకమైన సౌండ్ ఎఫెక్ట్‌తో, యానిమేటెడ్ ఆడియో ఎమోజీ దృశ్యరూపంలో కనపడుతుంది. గూగుల్ యాప్‌లోని 'కాల్ స్క్రీన్ ఫీచర్'ను ఎంచుకోవటం ద్వారా ఇది ప్లే అవుతుంది. దీనిపై గూగుల్ అధికారికంగా ఇంకా ప్రకటన చేయాల్సి ఉంది.

మసాలాలతో క్యాన్సర్‌కు వైద్యం

- మద్రాస్ ఐఐటీకి దక్కిన పేటెంట్
- జంతువులపై ప్రయోగాలు సక్సెస్
- త్వరలోనే మనుషులపై ట్రయల్స్
- 2028 నాటికి మార్కెట్లోకి ఔషధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిని భారతీయులు వంటింట్లో నిత్యం ఉపయోగించే మసాలా దినుసులతో నయం చేసే విధానాన్ని మద్రాస్ ఐఐటీ పరిశోధకులు ఆవిష్కరించారు. దీనిపై తాజాగా పేటెంట్ కూడా పొందారు. ఈ ఔషధంపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించి 2028 నాటికి మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఐఐటీ మద్రాస్‌లోని కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఆర్ నాగరాజన్ తెలిపారు. ఊపిరితిత్తులు, రొమ్ము, పెద్దపేగు, గర్భాశయ, నోటి, థైరాయిడ్ క్యాన్సర్లను మసాలాల నుంచి సేకరించిన నానోమెడిసిన్‌తో నయం చేయవచ్చని ఐఐటీ మద్రాస్ పరిశోధకులు నిరూపించారు. ఈ ఔషధంతో క్యాన్సర్ కణాల చుట్టూ ఉండే ఆరోగ్యకరమైన కణాలకు ఎలాంటి ముప్పూ ఉండదని తెలిపారు. జంతువులపై ఈ ఔషధంతో చేసిన ప్రయోగాలు సానుకూల ఫలితాలిచ్చాయి. త్వరలోనే మనుషులపై క్లినికల్ ట్రయల్స్ చేపట్టనున్నారు. ప్రస్తుతం తక్కువ ఖర్చుతో ఎలా ఉత్పత్తి చేయాలన్నదానిపై దృష్టిపెట్టినట్టు నాగరాజన్ తెలిపారు.

తీవ్రమైన ఒత్తిడితో క్యాన్సర్ ముప్పు!

న్యూయార్క్: తీవ్రమైన మానసిక ఒత్తిడి కారణంగా బ్రెయిన్ స్ట్రోక్స్, గుండె సమస్యలేగాక..క్యాన్సర్ బారిన పడే అవకాశమూ ఉందని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. ఒత్తిడిని ముందే గుర్తించి, చికిత్స తీసుకుంటే క్యాన్సర్ వ్యాధి ముదరకుండా ప్రాథమిక దశలో అడ్డుకోవచ్చునని న్యూయార్క్‌లోని 'కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ ల్యాబొరేటరీ' సైంటిస్టులు కనుగొన్నారు. స్ట్రెస్ హార్మోన్స్ ప్రభావంతో తెల్లరక్త కణాలైన 'న్యూట్రోఫిల్స్' శరీరంలో క్యాన్సర్ కణతులు ఏర్పరుస్తున్నాయని, ఎలుకలపై వివిధ రకాలుగా జరిపిన ప్రయోగాల్లో ఇది నిరూపితమైందని పరిశోధకులు చెప్పారు.

ప్యాసింజర్ రైళ్లు కనుమరుగు!

- ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్‌గా మార్పు
- బోగీలు, రూట్లు, వేగంలో మార్పు లేకున్నా అధిక చార్జీలు
- రైల్వేపై సామాన్యుల ఆగ్రహం

చెన్నై: ప్యాసింజర్ రైళ్ల శకం ముగిసినట్లే కనిపిస్తున్నది! భారతీయ రైల్వే వీటిని ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్‌గా నడుపుతూ, టికెట్ ధరలను అమాంతం పెంచేస్తున్నది. అన్ని స్టేషన్ల లోనూ ఆగుతూ ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను నమ్ముకున్న కూలీలు, చిరు వ్యాపారులు వంటి అల్పాదాయ వర్గాలవారిని ఈ పరిణామాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్యాసింజర్ రైళ్లలో సెకండ్ క్లాస్ ఆర్డినరీ టికెట్‌కు చెల్లు చీటీ రాశారు. ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్‌లో ప్రయాణించేవారి నుంచి ఎక్స్‌ప్రెస్ రైలు చార్జీలను వసూలు చేస్తున్నారు. అంటే, అంతకు ముందు ప్యాసింజర్ రైళ్ల టికెట్ ధరకు దాదాపు రెట్టింపు వసూలు చేస్తున్నారు. బోగీలు, రూట్లు, వేగం, స్టాపేజీలలో ఎటువంటి మార్పులు లేకపోయినా అధిక చార్జీలను వసూలు చేస్తున్నారు. సదరన్ రైల్వే ఇప్పటికీ బుకింగ్ కౌంటర్ల వద్ద సెకండ్ క్లాస్ ఆర్డినరీ టికెట్ చార్జీలతో బోర్డులను ప్రదర్శిస్తున్నది. కానీ ఈ చార్జీలు ప్రస్తుతం అమల్లో లేవు. ఓ స్టేషన్‌లోని టికెట్ బుకింగ్ క్లర్క్ మాట్లాడుతూ, ప్రయాణికులు ఈ బోర్డులను చూపించి, రెట్టింపు చార్జీ ఎందుకు చెల్లించాలని ప్రశ్నిస్తూ, తమతో ఘర్షణ పడుతున్నారని, ప్యాసింజర్ రైళ్లు లేవని వారికి అర్థం కావడం లేదని చెప్పారు. యూటీఎస్ యాప్‌లో కూడా పాత టికెట్ ధరలనే చూపిస్తున్నారని అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు నక్సల్స్ మృతి

కొత్తగూడెం క్రైమ్, ఫిబ్రవరి 25: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు జిల్లా ఎస్పీ ఇందిర కల్యాణ్ ఎలెసెల చెప్పారు. జిల్లా రిజర్వు గార్డ్, బీఎస్ఎఫ్ సంయుక్తంగా యాంటీ నక్సల్ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. కోయలిబేడ అడవిలో మావోయిస్టులు-భద్రతా దళాల మధ్య దాదాపు అర గంట సేపు కాల్పులు జరిగాయన్నారు. మావోయిస్టులు కాల్పులు జరుపుతూ అడవిలోకి పారిపోయారని చెప్పారు. సంఘటన స్థలంలో 2 తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మందుపాతర పేలి జవాన్ మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ జవాన్ మృతిచెందాడు. బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. బేచపాల్ బేస్‌క్యాంపునకు చెందిన సీఏఎఫ్ జవాన్లు ఏరియా డామినేషన్‌లో భాగంగా ఆదివారం చప్టాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో సీఏఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఆశిష్ యాదవ్ ఓ చప్టాపై నడుస్తుండగా మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి అక్కడికక్కడే మృతిచెందారు.

జ్ఞానవాపీలో ప్రార్థనలపై నేడు హైకోర్టు తీర్పు

అలహాబాద్: యూపీ వారణాసిలోని జ్ఞానవాపీ మసీదు ప్రాంగణంలోని వ్యాస్ తహ్‌ఖానాలో హిందువుల ప్రార్థనకు అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై అలహాబాద్ హైకోర్టు సోమవారం తీర్పు చెప్పనుంది. మసీదులోని ఒక సెల్లార్‌లో హిందూవులు పూజలు చేసుకోవడానికి వారణాసి జిల్లా కోర్టు అనుమతి ఇవ్వడంతో 31 ఏండ్ల తర్వాత తొలిసారిగా గత నెలలో ఇక్కడ పూజలు జరిపారు. అయితే పూజలు నిలిపివేస్తూ స్టే ఇవ్వాలంటూ కొన్ని ముస్లిం సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం హైకోర్టు తీర్పును వెలువరించనుంది.

ప్రైమరీ డెంగ్యూ చాలా డేంజర్!

న్యూఢిల్లీ: ప్రైమరీ డెంగ్యూ (మొదటిసారి సోకడం) కన్నా.. సెకండరీ డెంగ్యూ ఇన్‌ఫెక్షన్ చాలా ప్రమాదకరమన్న భావన ఇప్పటివరకు ఉంది, అయితే ఇది నిజం కాదని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. సెకండరీ డెంగ్యూ కన్నా..ప్రైమరీ డెంగ్యూ వైరస్ ఇన్‌ఫెక్షన్ అత్యంత ప్రమాదకరమని, దీనివల్లే మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని భారత్, అమెరికా సైంటిస్టుల సంయుక్త పరిశోధన తెలిపింది. చాలా వరకు డెంగ్యూ చికిత్స, వ్యాక్సిన్ల తయారీ, అభివృద్ధి అంతా కూడా సెకండరీ ఇన్‌ఫెక్షన్ చుట్టూనే తిరుగుతున్నదని, ఈ వ్యాధి పట్ల మన అవగాహనను మార్చుకోవాల్సిన సమయం వచ్చిందని సైంటిస్టులు చెప్పారు.

లోకోపైలట్లు లేకుండానే 70 కి.మీ. దూసుకెళ్లిన రైలు

జమ్ము/చండీగఢ్: లోకో పైలట్లు లేకుండా ఓ గూడ్సు రైలు 70 కిలోమీటర్లు పరుగులు తీసింది. ఆదివారం ఉదయం 7.25-9.00 గంటల మధ్య జరిగిన ఈ ఘటనపై అధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. డ్రైవర్లు లేకుండా రైలు 70 కిలోమీటర్లు ప్రయాణించినా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 53 వేగన్లతో చిప్‌స్టోన్స్‌ను మోసుకుని జమ్ము నుంచి పంజాబ్ వైపు రైలు బయలుదేరింది. డ్రైవర్ చేంజ్ కోసం జమ్ములోని కథువా రైల్వే స్టేషన్‌లో రైలును నిలిపారు. ఆ ప్రదేశం కొంత వాలుగా ఉండడంతో తర్వాత కాసేపటికే రైలు నెమ్మదిగా కదులుతూ ముందుకు దూసుకెళ్లింది. ఆ సమయంలో రైలులో లోకోపైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ ఎవరూ లేరని అధికారులు తెలిపారు. నెమ్మదిగా కదిలిన రైలు ఆ తర్వాత వేగం పుంజుకుంది. చివరికి పంజాబ్‌లోని ఉంచి బస్సీ రైల్వే స్టేషన్లో ఆగింది. ఈ ఘటనకు గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తునకు ఆదేశించినట్టు జమ్ము డివిజినల్ ట్రాఫిక్ మేనేజర్ ప్రతీక్ శ్రీవాస్తవ తెలిపారు.

రష్యా- ఉక్రెయిన్ యుద్ధంలో భారతీయుడి మృతి

మాస్కో: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో 23 ఏండ్ల భారతీయుడు మరణించాడు. ఈనెల 21న డోనెట్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ బలగాల వైమానిక దాడుల్లో గుజరాత్‌కు చెందిన హిమిలి అశ్విన్‌భాయి మంగుకియా మరణించినట్టు ఆదివారం వార్తా కథనాలు వెలువడ్డాయి. గత డిసెంబర్‌లో రష్యాకు వెళ్లిన ఇతను, అక్కడి సైన్యంలో 'సెక్యూరిటీ హెల్పర్'గా చేరినట్టు తెలిసింది.

దేశంలోనే అతి పొడవైన తీగల వంతెన

న్యూఢిల్లీ : దేశంలోనే అతి పొడవైన తీగల వంతెన 'సుదర్శన్ సేతు'ను ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. 2.3 కిలోమీటర్ల పొడవైన ఈ వంతెన గుజరాత్‌లోని ద్వారక జిల్లాలో గల ఓఖాను బెట్ ద్వారకతో అనుసంధానిస్తుంది. రూ.979 కోట్లతో ఈ బ్రిడ్జి నిర్మించారు.

మన్‌కీబాత్‌కు మూడు నెలలు విరామం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువత రికార్డు స్థాయిలో ఓటేయాలని ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'లో పిలుపునిచ్చారు. మార్చిలో ఎన్నికల నైతిక నియమావళి అమల్లోకి రానుండటంతో మూడు నెలల పాటు మన్ కీ బాత్ ఉండదని వెల్లడించారు.

5 ఎయిమ్స్‌లను ప్రారంభించిన మోదీ

రాజ్‌కోట్: మంగళగిరి (ఆంధ్రప్రదేశ్), రాజ్‌కోట్ (గుజరాత్), భటిండా (పంజాబ్), రాయ్‌బరేలీ (యూపీ), కల్యాణి (పశ్చిమ బెంగాల్) లలో ఎయిమ్స్‌లను ప్రధాని మోదీ ఆదివారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

సముద్ర గర్భంలో ప్రార్థనలు

గుజరాత్‌లోని ఆరేబియా సముద్ర పంచ్‌కుయి బీచ్‌లో ఆదివారం మోదీ స్కూబా డైవింగ్ చేశారు. సముద్ర గర్భంలోని పురాతన ద్వారక నగరాన్ని సందర్శించారు. 'ద్వారక నగరంలో ప్రార్థనలు చేయడం, స్కూబా డైవింగ్ చక్కని దైవికానుభూతిని కలిగించింది' అని ఎక్స్‌లో మోదీ ట్వీట్ చేశారు.

లోక్‌సభకు పోటీ చేయలేం!

- కర్ణాటక కాంగ్రెస్ మంత్రుల విముఖత
- శివకుమార్ డిన్నర్ భేటీకి గైర్హాజరు
- సీఎం, డిప్యూటీ సీఎంలే లోక్‌సభకు వెళ్లాలన్న మంత్రి మహదేవప్ప

శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 25: కర్ణాటక కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల భయం పట్టుకొన్నట్టు కనిపిస్తున్నది. తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో మెజార్టీ స్థానాల్లో విజయం సాధించలేకపోతే.. అది ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నదని రాష్ట్ర పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న పలువురిని లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయించేందుకు హస్తం పార్టీ ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. అయితే ఇందుకు అమాత్యులు విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు కర్ణాటక డిప్యూటీ సీఎం, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన డిన్నర్ సమావేశానికి కొంత మంది మంత్రులు డుమ్మా కొట్టడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. మరి కొంత మంది మంత్రులు ఈ భేటీకి హాజరైనప్పటికీ, జాతీయ రాజకీయాల్లోకి వెళ్లేందుకు తమకు ఆసక్తి లేదని, ఎంపీగా తమ కుమారులకు టికెట్టు ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది. డీకే ఏర్పాటు చేసిన ఈ డిన్నర్ సమావేశానికి మంత్రులు హెచ్‌సీ మహదేవప్ప, సతీశ్ జార్కిహోళి, కేఎన్ రాజన్న, బైరటి సురేష్, సంతోష్, శరణ బసప్ప గైర్హాజరు అయ్యారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

భేటీకి అధిష్ఠాన దూతల హాజరు

డీకే డిన్నర్ భేటీకి మాజీ కేంద్ర మంత్రి దిగ్విజయ్ సింగ్, కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ కూడా హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికలపై చర్చించామని, అభ్యర్థుల జాబితాను త్వరలో విడుదల చేయాల్సిన అవసరం ఉన్నదని హోంమంత్రి జీ పరమేశ్వర్ అన్నారు. అభ్యర్థుల ఎంపికపై పార్టీ స్క్రీనింగ్ కమిటీ ఇప్పటికే పలు రౌండ్ల చర్చలు జరిపిందని, మరో భేటీ అనంతరం తుది జాబితా సెంట్రల్ ఎలక్షన్ కమిటీ వద్దకు వెళ్తుందని తెలిపారు.

20 స్థానాలైనా గెలిస్తేనే పదవులు పదిలం!

సమావేశానికి హాజరైన మంత్రులతో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సంబంధిత లోక్‌సభ స్థానాలు, అభ్యర్థిత్వం అంశాలపై వేర్వేరుగా చర్చలు జరిపినట్టు సమాచారం. రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాలకు కనీసం 20 మందిని గెలిపించడం ద్వారా తమ పదవులను ఎన్నికల తర్వాత కూడా పదిలం చేసుకోవాలనే ప్లాన్‌లో వారిద్దరు ఉన్నారని కాంగ్రెస్ నేత ఒకరు పేర్కొన్నారు. కాగా, మంత్రి మహదేవప్పను చామరాజనగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలని సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అంతకుముందు పట్టుబట్టినట్టు తెలిసింది. అయితే ఇందుకు విముఖత వ్యక్తం చేసిన మహదేవప్ప.. వారిద్దరికీ ఇటీవల వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారు. 'సీఎం, డిప్యూటీ సీఎం ఇద్దరూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయాలి. ముఖ్యంగా రెండో వ్యక్తికి(డీకే) ఎక్కువగా అవకాశం ఉంటుంది' అని అన్నారు. ఇక పీడబ్ల్యూడీ మంత్రిగా ఉన్న సతీశ్ జార్కిహోళిని బెళగావి లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలని రాష్ట్ర పార్టీ కోరినట్టు ప్రచారం జరుగుతున్నది.

అందుకు నాకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలి

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం, ఎల్జీ సృష్టిస్తున్న అడ్డంకులు, ఆటంకాల మధ్య ఢిల్లీ ప్రభుత్వాన్ని నడుపుతున్నందుకు తనకు నోబెల్ బహుమతి రావాలని సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'వారు (బీజేపీని ఉద్దేశించి) ఢిల్లీలో దవాఖానలు, పాఠశాలల నిర్మాణాన్ని నిలిపివేయించడానికి ప్రయత్నిస్తారు. పేద పిల్లలకు వారి పిల్లలకు అందే విద్యే అందాలని అనుకోరు. అలాంటి పరిస్థితుల్లో ఢిల్లీ ప్రభుత్వాన్ని ఎలా నడుపుతున్నానో నాకొక్కడికి మాత్రమే తెలుసు. దీనికి నాకు నోబెల్ బహుమతి రావాలి' అంటూ కేజ్రీవాల్ అన్నారు.

నన్ను చంపేందుకు ఫడ్నవీస్ కుట్ర: జరాంగే

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్‌పై మరాఠా రిజర్వేషన్ ఉద్యమకారుడు మనోజ్ జరాంగే సంచలన ఆరోపణ చేశారు. తనను చంపేందుకు ఫడ్నవీస్ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. తాను ముంబై వెళ్లి, ఫడ్నవీస్ నివాసం వద్ద ధర్నా చేస్తానని హెచ్చరించారు. జల్నాలోని అంతర్వాలి సరటిలో జరిగిన కార్యక్రమంలో దాదాపు ఓ గంటసేపు ప్రసంగించిన ఆయన చివరిలో ఈ ఆరోపణలు చేసేసరికి ఆయన మద్దతుదారులు అవాక్కయ్యారు. జరాంగే ఆరోపణలపై సీఎం ఏక్‌నాథ్‌షిండే స్పందించారు. తమ సహనాన్ని పరీక్షించొద్దని జరాంగేను హెచ్చరించారు.

నింగిలో భారీ నిఘా నేత్రం!

- రోదసిలోకి శక్తివంతమైన ఉపగ్రహం
- వచ్చే ఏడాది ప్రవేశపెట్టనున్న 'అల్బెడో'
- ప్రపంచంలో ఎవరిపైన అయినా జూమ్
- వ్యక్తిగత గోప్యతకు తీవ్ర ముప్పు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు



వాషింగ్టన్ : రోదసి నుంచి ప్రపంచంలో ఎవరిపైన అయినా, ఎక్కడున్నా తీక్షణంగా నిఘా పెట్టగలిగే ఓ అత్యంత శక్తివంతమైన ఉపగ్రహాన్ని వచ్చే ఏడాది నింగిలోకి ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధమవుతున్నది. అమెరికా స్టార్టప్ 'అల్బెడో' రూపొందించిన ఈ ఉపగ్రహాన్ని భూమి ఉపరితలానికి కేవలం 100 మైళ్ల ఎత్తులో ప్రవేశపెట్టనున్నారు. ఇది ఎంతో నాణ్యమైన ఉపగ్రహమని, నింగి నుంచి వ్యక్తులపై లేదా ఏదైనా వస్తువులు, ప్రాంతాలపై నిశితంగా దృష్టి సారించగలదని (జూమ్ చేయగలదని) నిపుణులు చెప్తున్నారు. దీన్ని నింగిలో ప్రవేశపెడితే ప్రజల వ్యక్తిగత గోప్యతకు తీవ్రమైన ముప్పు వాటిల్లడం ఖాయమని, ఓ 'బిగ్ బ్రదర్' నిత్యం మనల్ని, మన కదలికలను సునిశితంగా గమనించే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉపగ్రహాన్ని 'అంతరిక్షంలో ఉండే భారీ కెమెరా'గా ఎలక్ట్రానిక్ ఫ్రాంటియర్ ఫౌండేషన్ జనరల్ కౌన్సెల్ జెన్నిఫర్ లించ్ అభివర్ణించారు. మనకు తెలియకుండా దీన్ని ఏ ప్రభుత్వమైనా, ఎప్పుడైనా ఉపయోగించవచ్చని 'న్యూయార్క్ టైమ్స్' పత్రికకు తెలిపారు. అయితే మనుషుల ముఖాలను గుర్తించగలిగే (ఫేసియల్ రికగ్నిషన్) సాఫ్ట్‌వేర్ ఈ ఉపగ్రహంలో ఉండదని 'అల్బెడో' చెప్తున్నప్పటికీ.. ఇది వ్యక్తులను చిత్రీకరించదని గానీ లేదా ప్రజల గోప్యతను పరిరక్షిస్తుందని గానీ భరోసా ఇవ్వడం లేదు. జాతీయ భద్రతకు ఎదురయ్యే ప్రమాదాలను పసిగట్టడంలో అమెరికా ప్రభుత్వానికి చేయూతనిచ్చేందుకు 'అల్బెడో' ఇప్పటికే యూఎస్ ఎయిర్‌ఫోర్స్‌తో పాటు నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ఇంటెలిజెన్స్ సెంటర్‌తో లక్షల డాలర్ల విలువైన రెండు భారీ ఒప్పందాలను కుదుర్చుకున్నది. అత్యంత దిగువ భూకక్ష్య (వెరీ లో ఎర్త్ ఆర్బిట్)లో ప్రవేశపెట్టనున్న ఈ ఉపగ్రహాన్ని వాణిజ్యపరం చేసేందుకు 2022 సెప్టెంబర్‌లో 48 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.397 కోట్లు) సమీకరించుకున్న 'అల్బెడో'.. గత నెలలో మరో 35 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.290) సమీకరించింది.

సొంత దేశంలో పరాయి వాళ్లమయ్యాం!

పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో రైతుల ఆవేదన

ఢిల్లీ చలోలో భాగంగా శంభు సరిహద్దులో కుటుంబాలతో కలిసి ధర్నా చేస్తున్న రైతులు

చండీగఢ్: కనీస మద్దతు ధరకు(ఎంఎస్పీ) చట్టబద్ధత కల్పించడంతోపాటు తమ ఇతర న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో' మార్చ్ పోలీసులు సృష్టించిన అడ్డంకులతో ముందుకు సాగడం లేదు. రైతాంగం ఢిల్లీ వైపుగా వెళ్లనీయకుండా భద్రతా బలగాలు అడ్డుకోవడంతో వేలాది మంది రైతులు పంజాబ్-హర్యానా సరిహద్దులోనే గత 10 రోజులకు పైగా నిలిచిపోయారు. ఢిల్లీకి మార్చ్‌గా వెళ్లేందుకు శంభు, ఖనౌరి సరిహద్దుల్లో అన్నదాతలు వేచిచూస్తున్నారు. ఓవైపు కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న చర్చలు విఫలమవుతుండటం.. మరోవైపు ఢిల్లీ వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న రైతులను నియంత్రించేందుకు పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించడంతో ఇటీవల పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సరిహద్దు పాయింట్ల వద్ద కిలోమీటర్ల మేర రైతులు తమ ట్రాక్టర్లు, ఇతర రూపాల్లో నివాసం ఏర్పరచుకొని ఢిల్లీ పయనానికి వేచిచూస్తున్నారు. ఈ క్రమంలో వారిని పలుకరించిన ఒక మీడియా సంస్థ వద్ద రైతులు తమ సమస్యలను, కేంద్రంపై ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. అమృత్ సింగ్ అనే రైతు మాట్లాడుతూ సొంత దేశంలో పరాయి వాళ్లం అయిపోయామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు కనీస మద్దతు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నదని అన్నారు. ఒక వస్తువును తయారు చేస్తున్న తయారీదారు దాని ధరను నిర్ణయిస్తున్నాడని, అయితే రైతుకు ఆ హక్కు లేకుండా పోయిందని ఎత్తిచూపారు. ఎంఎస్పీకి చట్టబద్ధతపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీనే అమలు చేయాలని అడుగుతున్నామే తప్ప మరేమీ కాదని అమృత్ సింగ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'ఇంట్లో ఏదైనా స